# మోదీవి మోసపూరిత వాగ్దానాలు

- గిరిజనుల ఓట్ల కోసం నాటకాలు
- చిత్తశుద్ధి ఉంటే సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతీయహోదా ఇవ్వాలి
- పదేండ్లు మా బిడ్డలను మోసం చేశారు..
- ప్రధానిపై రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్ ఫైర్
- కేంద్రం కుట్రలను మేధావులు తిప్పికొట్టాలి...
- అన్నివర్గాల అభ్యున్నతే బీఆర్ఎస్ లక్ష్యం
- స్వరాష్ట్రంలో కులవృత్తులకు చేయూత
- బీసీలకు రూ.లక్ష పథకం దేశంలో ఎక్కడా లేదు..
- కొత్తగూడ, గంగారం బీసీ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనానికి శంకుస్థాపన

మహబూబాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : గిరిజనుల ఓట్ల కోసమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ గిరిజన యూనివర్సిటీ ప్రకటనపై నిప్పులు చెరిగారు. 10 ఏండ్ల క్రితం విభజన హామీలో పేర్కొన్న గిరిజనుల హక్కైన గిరిజన యూనివర్సిటీని తొక్కిపట్టి గిరిజన బిడ్డలకు తీరని అన్యాయం చేసింది మీరు కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్లతో తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులకు, రూ.2కోట్లతో బంజా రా భవన్‌కు శంకుస్థాపన చేశారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జింక విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బీసీ బంధు పథకానికి ఎంపికైన కొత్తగూడ, గంగారం మండలాల లబ్ధిదారులు 33 మందికి చెక్కులు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ... అన్నివర్గాల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు చేయూతనిస్తున్నారని, బీసీబంధు కింద రూ.లక్ష సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యంతో కులవృత్తులు కనుమరుగయ్యాయని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ వాటి జీవం పోశారని తెలిపారు. బీసీబంధు పథకం దేశంలో ఎక్కడా లేదన్నారు. నియోజకవర్గంలో 300 మందికి ఆర్థిక సాయాన్ని అందజేస్తామని ప్రకటించారు. కుల వృత్తులకు అవసరమైన ముడి సామగ్రి కొనుగోలుకు వినియోగించుకోవాలని లబ్ధిదారులకు మంత్రి సూచించారు.

గిరిజనులను మరోసారి ఓటు బ్యాంకుగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తించిందని మంత్రి సత్యవతి దుయ్యబట్టారు. 10 ఏండ్ల క్రితం 2014 విభజన హామీ చట్టం ప్రకారం అప్పుడే యూనివర్సిటీ ఇచ్చి ఉంటే మా బిడ్డలు బాగుపడేవారు కాదా అని నిలదీశారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని చట్టం చేసిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ ఒక సభ్యుడు కూడా కాదన్నారు. 10 సంవత్సరాల క్రితం ప్రకటించిన విభజన హామీ చట్టాన్ని తొక్కిపట్టి గిరిజనులకు తీరని అన్యాయం చేశారన్నారు. ఇప్పుడు గిరిజనుల ఓట్ల కోసం ప్రధాని చేస్తున్న మోసపూరిత కుట్రలను గిరిజన మేధావులు, యువత తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. 2014 నుంచి 2018 వరకు అనేకసార్లు కేంద్ర అధికారుల బృందం ఇక్కడి ప్రాంతాలను పరిశీలించిందన్నారు. ములుగు జిల్లా జాకారంలో 335 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందనే విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ఒప్పందాలు చేసుకున్నప్పటికీ గిరిజన యూనివర్సిటీ ఇవ్వకుండా తొక్కిపెట్టిందన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎకరం భూమిని కేటాయించకున్నా గిరిజన యూనివర్సిటీని మూడేళ్ల క్రితమే కేటాయించి, తెలంగాణపై అక్కసును వెల్లగక్కారని మండిపడ్డారు. నిజంగా కేంద్ర ప్రభుత్వానికి గిరిజనులపై చిత్తశుద్ధి ఉంటే సమ్మక్క– సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నయా పైసా ఇవ్వలేదన్నారు. జనాభా దామాషా ప్రకారం గిరిజన రిజర్వేషన్ పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపితే ఇప్పటికీ అతీగతీ లేదన్నారు. గిరిజనులపై బీజేపీకి ప్రేమ లేదనడానికి ఇవన్నీ నిదర్శనమన్నారు. సీఎం కేసీఆర్ గిరిజనులపై ప్రేమతో గిరిజన రిజర్వేషన్ 6 శాతం నుంచి 10శాతానికి పెంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల వేళ బీజేపీ చేస్తున్న కుట్రలను తెలంగాణ ప్రజలు తిప్పికొట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### మహాత్ముడికి నివాళి

గాంధీ జయంతి సందర్భంగా సోమవారం మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మహబూబాబాద్ జిల్లా కేంద్రం గాంధీపార్కులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమంలో సత్యం, అహింసామార్గాన్ని ఎంచుకుని ప్రపంచానికి స్ఫూర్తి దాయకంగా నిలిచారని అన్నారు. అహింసామార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గొప్ప దార్శనికుడు గాంధీజీ అని అన్నారు. బ్రిటీష్ పాలన నుంచి భారతదేశానికి విముక్తి కోసం గాంధీ మహాత్ముడు ఏ విధంగా పరితపించారో, సమైక్య పాలన నుంచి తెలంగాణకు విముక్తి కోసం కేసీఆర్ ప్రజలందరినీ ఏక తాటిపైకి తీసుకొచ్చి రాష్ట్రాన్ని సాధించారని అన్నారు.



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు బీసీబంధు చెక్కులను అందజేస్తున్న మంత్రి సత్యవతి, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ బిందు, కలెక్టర్ శశాంక తదితరులు



కలెక్టరేట్‌లో జింక విగ్రహన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి,ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జడ్పీచైర్‌పర్సన్, కలెక్టర్



కలెక్టరేట్‌లో విలేకరులకు ఇండ్ల పట్టాలను అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జడ్పీచైర్‌పర్సన్

# కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమం

- మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆరే..
- ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మొద్దు
- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

డోర్నకల్, అక్టోబర్ 2 : సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ గెలవడం ఖాయమని డోర్నకల్ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ అన్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ, గొల్లచర్ల, కంసలి తండా, బోరింగ్ తండా, మన్నెగూడెంలో సోమవారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గొల్లచర్ల నుంచి బోడమంజ్య తండాకు రూ. కోటి 50 లక్షలతో, బోడహట్య తండా నుంచి కంసలితండా వరకు రూ.కోటి 50 లక్షలు, బోరింగ్ తండా నుంచి ఇస్రా తండా వరకు రూ.కోటితో బీటీ రోడ్డు మంజూరు చేయించి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. వానకాలం వరకు పనులు పూర్తవుతాయన్నారు. నియోజకవర్గంలో 1200 మందికి దళితబంధు పథకం ద్వారా యూనిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. బీసీబంధు ద్వారా అర్హులందరికీ రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. గత జనవరి 12న నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ డోర్నకల్ మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, మరిపెడ మున్సిపాలిటీకి రూ.25 ఇచ్చారని, ఇటీవల మంత్రి కేటీఆర్ డోర్నకల్ మున్సిపాలిటీకి రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులన్నీ పూర్తయితే పట్టణ రూపురేఖలు మారుతాయన్నారు. ప్రతిపక్ష నాయకులు ఎన్నికలప్పుడే కనిపిస్తారని, వారి మాటలను ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ కవిత రైల్వేబ్రిడ్జి నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు చేయించి పనులు చేయిస్తున్నదన్నారు. ఈ నెల 5న సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్ లబ్ధిదారులకు శుభవార్త చెప్పనున్నట్లు తెలిపారు. నిత్యం మీ సేవలో ఉంటున్నా.., రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరిపెడలో వందపడకల వైద్యశాల శంకుస్థాపన కార్యక్రమానికి కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చినట్లు తెలిపారు. బతుకమ్మ చీరెలు కూడా వచ్చాయని, ఈ నెల 4 నుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తోడేళ్లగూడెం శ్రీ వల్లి సుబ్రహ్మణ్య స్వామి ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు, పెరుమాండ్ల సంకీస శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మన్నెగూడెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గొల్లచర్ల, వెన్నారం, తోడేళ్లగూడెం గ్రామాల్లో ఐకేపీ మహిళలకు ఫ్లోర్‌మిల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, మండల అధ్యక్షుడు నున్న రమణ, జడ్పీటీసీ పొడిశెట్టి కమలారామనాథం, మున్సిపల్ వైస్‌చైర్మన్ కోటిలింగం, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, మాజీ జడ్పీటీసీ గొర్ల సత్తిరెడ్డి, వైస్ ఎంపీపీ తుమ్మ వెంకటరెడ్డి, మండల కో ఆప్షన్ షేక్ లాలుమియా,మున్సిపల్ కమిషనర్ మున్వర్‌అలీ, ఎంపీడీవో చలపతిరావు, కౌన్సిలర్లు సురేందర్ కుమార్‌జైన్, జనార్దన్, శరత్‌బాబు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు అజిత్‌మియా, రాంభద్రం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మన్మథరావు, సర్పంచ్‌లు సమ్మి రెడ్డి, పగడాల అంజయ్య, ఎంపీటీసీలు శంకర్‌కోటి, భూక్యా శ్రీనివాస్, ఏపీఎం శంకర్, ఎంపీవో మున్వర్‌భేగ్, నాయకులు పాల్గొన్నారు.



డోర్నకల్‌లోని జైన్ భవనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
సబ్ ఎడిటర్లు కావలెను
ప్రముఖ దినపత్రిక నమస్తే తెలంగాణ
వరంగల్ యూనిట్
కార్యాలయంలో పని చేయడానికి
సీనియర్ సబ్ ఎడిటర్లు/సబ్ ఎడిటర్లు
కావలెను.
తెలుగు భాష, క్వార్క్ ఎక్స్‌ప్రెస్ మీద పట్టు,
ప్రధాన పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పని చేసిన అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాను
hr@tppl.news మెయిల్ ఐడీకి
ఈ నెల 5 లోగా పంపగలరు.
వివరాలకు 040-23291159